క్లుప్తంగా

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

రూ.27 వేల నగదు, ఐదు బైక్‌లు సీజ్



కోడూరు: పేకాట శిబిరంపై స్థానిక పోలీసులు మెరుపు దాడులు నిర్వహించి, పేకాటరాయళ్లను అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని లింగారెడ్డిపాలెం శివారు జరుగువానిపాలెం గ్రామ సమీపంలో పేకాట శిబిరం కొనసాగుతుందనే సమాచారంలో ఆదివారం వేకువజామున దాడులు జరిపినట్లు ఎస్‌ఐ చాణిక్య తెలిపారు. ఈ దాడుల్లో ఐదుగురు పేకాటరాయళ్లను అరెస్టు చేసి, వారి వద్ద రూ.27,260 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. శిబిరం వద్ద ఉన్న ఐదు ద్విచక్రవాహనాలతో పాటు సెల్‌ఫోన్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

సాగరతీరంలో మెరైన్ పోలీసుల గస్తీ



కోడూరు: హంసలదీవి సాగరతీరంలో పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు ప్రత్యేక గస్తీ నిర్వహించారు. ఆదివారం సెలవుదినం నేపథ్యంలో వివిధ సుదూర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు తీరానికి పెద్దసంఖ్యలో తరలివచ్చారు. హైదరాబాద్, విజయవాడ, గుంటూరుకు చెందిన యాత్రికులు తీరంలో సందడి చేశారు. యువత తీరం వెంట ఆటలాడుతూ సరదాగా గడిపారు. తీరంలోని పర్యాటకులకు జాగ్రత్తలు వివరిస్తూ పోలీసులు గస్తీ చేపట్టారు. సముద్రంలోకి లోతుకు వెళ్లి స్నానాలు చేయరాద్దంటూ లౌడ్‌స్పీకర్ల ద్వారా పర్యాటకులను అప్రమత్తం చేశారు. ఎస్‌ఐలు ఉజ్వల్, పూర్ణ మాధురి, రైటర్ రెహ్మాన్‌జానీ పర్యవేక్షించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెడన: స్థానిక బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో ఈ నెల 17 నుంచి ప్రారంభించనున్న స్కిల్ హబ్ ద్వారా పలు కోర్సుల్లో శిక్షణ పొందేందుకు అర్హులైన అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకోవాలని కో ఆర్డినేటర్ వంగా బాబు కోరారు. ఆదివారం ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. 10వ తరగతి ఆపైన విద్య అభ్యసించినవారు, 15 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారు ఉచితంగా పలు కోర్సుల్లో శిక్షణ పొందేందుకు అర్హులని బాబు తెలిపారు. వివరాలకు మొబైల్ నంబరు 88977 72488లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన



చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లి గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు ఆదివారం నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ జి.భానుమూర్తి విద్యార్థినులకు నేత్ర పరీక్షలు చేసి కళ్లజోళ్లకు సిఫారసు చేశారు. అనంతరం హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోవాడ ప్రశాంతి ఆధ్వర్యంలో బాలలహక్కులు, బాల్య వివాహాలు, విద్యార్థినుల చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణ గురించి విద్యార్థినులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.అరుణ కుమారి, పలువురు అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గర్భిణుల ర్యాంప్ వాక్

రామవరప్పాడు: సంప్రదాయ, పాశ్చాత్య వస్త్రధారణలతో గర్భిణులు ర్యాంప్ వాక్ చేసి ఆకట్టుకున్నారు. విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని అను మై బేబీ 3వ వార్షికోత్సవాలను ఆదివారం వినూత్నంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సినీ తార పూర్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరోయిన్ పూర్ణ మాట్లాడుతూ ఈ వార్షికోత్సవ సంబరాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. నారీ శక్తికి నిదర్శనంగా ఈ కార్యక్రమం నిలుస్తోందన్నారు. అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ జి.శ్రీదేవి మాట్లాడుతూ అను మై బేబీ మూడేళ్ల ప్రస్థానంలో అనేక మైలురాళ్లను అధిగమించిందని తెలిపారు. వైద్య నిపుణులతో మంచి ప్రమాణాలతో వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ జి. రమేష్, వైద్యులు డాక్టర్ కవిత, పావని, మంజు హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

భయపెడుతున్న బంగారుతీగ

- మినుము పంటను చుట్టేస్తున్న బంగారుతీగ
- పూత దశలోనే పంటను పీకేయాల్సిన దుస్థితి
- కుదేలవుతున్న రైతులు
- కౌలు రైతుల పరిస్థితి మరింత దీనం
- ప్రభుత్వం విత్తన సరఫరా చేయక పోవడమే కారణం



బంగారుతీగ ఆశించిన మొక్కలు తీసేయడంతో ఖాళీ అయిన పొలం

అవనిగడ్డ: గతంలో ఎన్నడూ లేని విధంగా మినుము పంటను బంగారుతీగ చుట్టేస్తోంది. పూత, పిందె దశలో బంగారుతీగ ఉధృతి పెరగడంతో పూతమీదున్న మొక్కలను లాగించి పారేస్తున్నారు. ప్రభుత్వం మినుము విత్తనాలు సరఫరా చేయక పోవడం, రైతుల నుంచి సేకరించిన విత్తనాలు చల్లడం వల్ల ఈ సంవత్సరం బంగారుతీగ బాగా పెరిగిపోయిందని కొంతమంది రైతులు చెప్పారు.

చేతికొచ్చిన సమయంలో..

అవనిగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఈ ఏడాది రబీలో 64,865 ఎకరాల్లో మినుము పంట సాగుచేశారు. ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి, అవనిగడ్డ మండలాల్లో పూత, పిందె దశలో ఉండగా, కోడూరు, నాగాయలంకలో పూతకొచ్చే దశలో మినుము పంట ఉంది. ఇప్పటికే నాలుగైదు సార్లు పురుగు మందు, కలుపు మందు పిచికారీకి ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.18 వేలు ఖర్చు చేశారు. పూత, పిందె దశలో మినుము మొక్కలను బంగారుతీగ చుట్టేయడం వల్ల కూలీలతో మొక్కలను లాగించి పారేస్తున్నారు. వీటి నివారణకు కొంతమంది రెండు, మూడు సార్లు మందులు కొట్టినా ఉధృతి తగ్గలేదని, ఇంకా పెరిగిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



రోడ్డు పక్కన పడేసిన మినుము పంట



బంగారుతీగ ఆశించిన మినుము పైరు

ప్రభుత్వం విత్తనాలు సరఫరా చేయకపోవడం వల్లే..

ప్రతి సంవత్సరం ప్రభుత్వం 40 నుంచి 60 శాతం మినుము విత్తనాలను సబ్సిడీపై అందిస్తుంది. రైతుల అవసరాలను బట్టి విత్తనాలు ఇండెంట్ పెట్టి రప్పించేవారు. విత్తనశుద్ధి, బంగారుతీగ లేకుండా విత్తన సేకరణ చేయడం వల్ల బంగారుతీగ ఉధృతి ఎక్కువగా ఉండేదికాదు. ఈ సంవత్సరం ప్రభుత్వం పదిశాతం విత్తనాలు కూడా సరఫరా చేయక పోవడం వల్ల రైతుల నుంచే మినుము విత్తనాలను సేకరించి చల్లుకున్నారు. విత్తనాల నుంచే బంగారుతీగ రావడం వల్ల ఈ ఏడాది దీని తీవ్రత బాగా పెరిగింది.

కౌలు రైతు కుదేలు

రెండో పంట మినుముపై ఆశలు పెట్టుకుని కౌలు రైతులు ఎక్కువగా వరిసాగు చేస్తారు. మొదటి పంట కౌలు రూపేణా ఖర్చులకు పోగా రెండవ పంట మినుము వల్లనే కౌలు రైతులకు కొంత ఆదాయం. ఈ కారణంగానే ఎకరాకు రూ.15 వేల నుంచి 28 వేల వరకూ కౌలు ఇచ్చి సాగు చేస్తున్నారు. అలాంటిది ఈ సంవత్సరం బంగారు తీగ ఎక్కువగా వ్యాపించడం వల్ల దిగుబడి తగ్గిపోయి తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని కొంతమంది కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

కూలీలను పెట్టి లాగిస్తున్నా..



ఐదు ఎకరాలు కౌలుకు సాగుచేస్తున్నా. రెండు ఎకరాల్లో మినుము పంటకు ఉధృతంగా బంగారుతీగ వచ్చింది. దీని నివారణ కోసం ఇసుకలో కలిపి ఒకసారి, తరువాత మరోసారి మందులు కొట్టించాను. అయినా తగ్గలేదు. చేసేదిలేక కూలీలతో లాగించి పారేస్తున్నాను. ఏపుగా పెరిగిన పంటను లాగించడం చూస్తుంటే గుండెతరుక్కు పోతుంది.

– గాజుల రాముడు(రాంబాబు), కౌలు రైతు, బందలాయిచెరువు, అవనిగడ్డ మండలం

గతంలో ఇలా లేదు..



నేను ఐదెకరాలు కౌలుకు సాగుచేస్తున్నాను. గతంలో ఎప్పుడూ ఇంత ఉధృతంగా బంగారుతీగ లేదు. ఎక్కడ చూసినా పొలాల్లో బంగారుతీగ కనబడుతోంది. రెండు, మూడు సార్లు మందులు కొట్టినా తగ్గలేదు. దీనివల్ల ఎకరాకు రెండు, మూడు బస్తాలు దిగుబడి తగ్గిపోతుంది. ఈ సంవత్సరం కౌలు రైతులకు నష్టాలే.

– భావిశెట్టి వెంకటనాంచారయ్య, పిట్టల్లంక, కోడూరు మండలం

హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యే కాగితకు వినతిపత్రం అందజేస్తున్న శ్మశానవాటిక కమిటీ సభ్యులు

పెడన: పట్టణ పరిధిలోని 5వ వార్డులో ఉన్న హిందూ శ్మశాన వాటికలో పూర్తి సౌకర్యాలతో అభివృద్ధి చేస్తానని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో శ్మశాన వాటిక అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు శ్మశాన వాటికలో సమస్యలపై కాగితకు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్లో మాట్లాడిన కాగిత శ్మశాన వాటికలో జంగిల్ క్లియరెన్స్, చెత్తాచెదారాలు తొలగింపు పనులను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. స్థానికులు మరణిస్తే కార్యక్రమాల నిర్వహణకు ఉన్న ఇబ్బందులను ఎమ్మెల్యే కాగితకు కమిటీ సభ్యులు వివరించారు. శ్మశాన అభివృద్ధి కమిటీ సభ్యులు బొడ్డు వేణుగోపాల్, కట్టా హేమసుందరమూర్తి, ఊటుకూరి ప్రకాశరావు, బి.ప్రసాదు, కే వెంకటేశ్వరరావు, జీ మాధవరావు, కే లోకనాథం, పలు సామాజిక వర్గాలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



శ్రీకృష్ణుని విగ్రహం వద్ద పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు

ఘంటసాల: స్థానిక ప్రధాన సెంటర్లో శ్రీకృష్ణ ద్వారకా ఆలయం నిర్మాణానికి యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ రూ.20 లక్షల అంచానలతో నిర్మిస్తున్న శ్రీకృష్ణ ద్వారకా ఆలయాన్ని కృష్ణాష్టమి నాటికి పూర్తి చేసి ప్రారంభించాలని భూమి పూజ చేసి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తున్న అన్ని రాజకీయ పార్టీల నేతలకు, కార్యకర్తలకు, గ్రామస్తులకు యాదవ సంఘం తరపున ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. వివిధ పార్టీల నేతలు, ప్రముఖులు, గ్రామస్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇజ్‌తిమాకు తరలివెళ్లిన ముస్లింలు



గూడూరు: దావతే ఇస్లామి ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ కుమ్మరిపాలెం ఈద్గా గ్రౌండ్స్‌లో నిర్వహించిన దీనీ ఇజ్‌తిమాకు పెద్ద సంఖ్యలో ముస్లింలు తరలివెళ్లారు. ఇజ్‌తిమాకు వెళ్లే వారికోసం గూడూరు, ఆకులమన్నాడు గ్రామాల నుంచి ప్రత్యేక బస్సులను స్థానిక నిర్వాహకులు ఏర్పాటు చేశారు. దీంతో ఆయా గ్రామాల్లోని మత పెద్దలతో పాటుగా యువకులు బస్సులలో తరలివెళ్లారు.

బాల ఏసు విగ్రహం ఊరేగింపు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక గుడివాడ రోడ్డులోని జ్యోతినగర్ ఆర్సీఎం చర్చిలో అద్భుత దివ్య బాలఏసు మహోత్సవాలు మూడో రోజైన ఆదివారం ఘనంగా జరిగాయి. బాపులపాడు మండలం పెరికీడులోని సహాయమాత టవర్ నుంచి హనుమాన్‌జంక్షన్ నాలుగు రోడ్ల కూడలి వరకు బాలఏసు విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై క్రైస్తవులు ఊరేగింపు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మచిలీపట్నం మేత్రాసనం డీజీఎం ఫాదర్ వల్లె జోజిబాబు, ఫాదర్ పసల తోమాస్‌లు దివ్య పూజబలి సమర్పించారు. అనంతరం భక్తులకు దైవ సందేశాన్ని అందించారు. 'బీద లాజరు–ధనవంతుడు' అనే బైబిల్ నాటకాన్ని ప్రదర్శించారు. జ్యోతినగర్ చర్చి ఫాదర్ చేబ్రోలు జోసఫ్ తంబి, పాదర్ వినోద్, ప్యారిస్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

మూడో రోజూ కొనసాగిన విగ్రహ ప్రతిష్ఠ పూజలు

నేడు ప్రతిష్ఠా మహోత్సవం



పూజలు చేస్తున్న పురోహితులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని నిజాంపేటలో శ్రీ కల్యాణ సుందరేశ్వర సమేత శ్రీ విజయ వనమలమ్మ అమ్మవారి ఆలయం, విగ్రహం, పలు దేవతా మూర్తుల పునఃప్రతిష్ఠా మహోత్సవ పూజా కార్యక్రమాలు మూడో రోజైన ఆదివారం జరిగాయి. ఉదయం, సాయంత్రం పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో డెప్యూటీ మేయర్ శీలం భారతి, మాజీ కౌన్సిలర్ మారుతీరావు(బాబ్జీ) దంపతులతో పాటు పలువురు దంపతులు పీటలపై కూర్చున్నారు. సోమవారం ఉదయం 11.45 గంటలకు కొండరాయితో నిర్మించిన నూతన ఆలయంలో అమ్మవారి విగ్రహంతో పాటు సంకటహర మహాగణపతి, శ్రీ శక్తిధర సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శ్రీ కార్యసిద్ధి ఆంజనేయస్వామి, దీపస్తంభాలను ప్రతిష్ఠించనున్నారు. కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

వైఎస్సార్ సీపీ బీసీ నేత మృతికి మాజీ ఎమ్మెల్యే నివాళి



వెంకటేశ్వరరావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి (ఇన్‌సెట్)అవనిగడ్డ వెంకటేశ్వరరావు (ఫైల్)



అవనిగడ్డ: స్థానిక ఏడో వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ బీసీ నాయకుడు, సీనియర్ బైక్ మెకానిక్ అవనిగడ్డ వెంకటేశ్వరరావు (52) గుండెపోటుతో ఆదివారం మరణించారు. గుండెనొప్పిగా ఉందని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందుతూ మరణించాడు. వెంకటేశ్వరరావు భౌతికకాయాన్ని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సందర్శించి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వరరావు మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. సింహాద్రితో పాటు జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, పలువురు పార్టీ నాయకులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

22, 23 తేదీల్లో పోతురాజుస్వామి వార్షిక జాతర

నాగాయలంక: గ్రామంలోని బోసుబొమ్మ సెంటర్‌లో కొలువై ఉన్న శ్రీపోతురాజుస్వామి వార్షిక జాతర మహోత్సవం ఈనెల 22, 23 తేదీలలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ ప్రతినిధి ఉప్పల లీలాకృష్ణప్రసాద్ (బుజ్జి) ఆదివారం తెలిపారు. గ్రామంలో శుభకార్యాలు తలపెట్టుకునే వారి ముహుర్తాల సౌలభ్యం కోసం ముందుగా స్వామి జాతర విశేషాలు తెలియజేస్తున్నట్లు ఆయన వివరించారు. 22న ఉదయం 8గంటలకు కృష్ణానదిలో స్వామివారి ఘటం శుద్ధి పూజలు జరిపి జల్లి ఉంచుతారు. సాయంత్రం 5గంటలకు జల్లిలో నుంచి ఘటం తీసి రాత్రంతా గ్రామోత్సవం నిర్వహిస్తారు. 23న ఉదయం స్వామివారి ఘటం గుడికి చేరుకోవడంతో 9గంటలకు సంప్రదాయక గుడిజాతర (సంబరం) గుంటూరు జిల్లా పల్నాటి ఆచార వంతులచే ఆరంభం అవుతుంది. తదుపరి భక్తుల మొక్కుబడులు, చద్ది నైవేద్యాల సమర్పణ ఉంటాయి. దాతల ఆర్థిక సహకారంతో జాతరకు వచ్చిన భక్తులందరికీ అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహిస్తారు.

కార్తికేయుని ఆలయంలో భక్తుల కోలాహలం



ఆలయ ప్రాంగణంలో పోటెత్తిన భక్తులు

మోపిదేవి: ప్రసిద్ధపుణ్య క్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయం భక్తులతో కోలాహలంగా మారింది. ఆదివారం తెల్లవారుజాము నుంచే తెలుగు ఉభయ రాష్ట్రాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిక్కిరిసిపోయింది. ఆలయ ప్రాంగణం ఎటు చూసినా భక్తజనంతో నిండిపోయింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. దేవదాయశాఖ అందించే ఉచిత అన్నప్రసాదంలో వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ డీసీ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో సూపరింటెండెంట్స్ మదుసూధనరావు, బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● గిజిగాడి గూళ్లు



సహజసిద్ధ అందాలకు నెలవు పల్లెటూళ్లు. ప్రకృతిలోని ఎన్నో రమణీయ సుందర దృశ్యాలకు సాక్షీభూతంగా పల్లెలు నిలుస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదు. అయితే మనస్సుకు ఉల్లాసం కలిగించే ఎన్నో సహజమైన ప్రకృతి సోయగాలు ఇటీవల కనుమరుగైపోతున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో సర్వసాధారణమైన పిచ్చుకలు కళాత్మకంగా అల్లుకున్న గూళ్లు అదృశ్యమై పోతున్నాయి. ఇలాంటి తరుణంలో కృత్తివెన్ను మండలం గాంధీనగరం పరిసరాలలో కనిపించిన ఈ పిచ్చుక గూళ్లు నాటి రోజులను గుర్తుకు తెస్తున్నాయి.

– కృత్తివెన్ను

ఓవరాల్ చాంపియన్ లింగారెడ్డిపాలెం బాలికలు



గెలుపొందిన బాలికలకు జ్ఞాపికలు అందిస్తున్న ఎంఈఓలు

కోడూరు: అవనిగడ్డ నియోజకవర్గ స్థాయిలో జరిగిన సబ్‌జోన్ బాలికల పోటీల్లో మండలంలోని లింగారెడ్డిపాలెం జెడ్పీ పాఠశాల విద్యార్థినులు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. జనవరి 31, ఈ నెల 1వ తేదీన జెడ్పీ పాఠశాలలో నియోజకవర్గస్థాయి గ్రిగ్ మెమోరియల్ పోటీలను నిర్వహించారు. అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక, మోపిదేవి, చల్లపల్లి, ఘంటసాల మండలాల్లోని 25 పాఠశాలలకు చెందిన 600 మంది బాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, షటిల్, సాఫ్ట్‌బాల్, వాలీబాల్, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్ పోటీలను సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో నిర్వహించారు. ఈ పోటీల్లో లింగారెడ్డిపాలెం జెడ్పీ పాఠశాల విద్యార్థినులు సత్తాచాటి ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. లింగారెడ్డిపాలెం జట్టు కబడ్డీ పోటీల్లో సీనియర్స్ విభాగంలో ప్రథమస్థానం, జూనియర్స్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచారు. ఖోఖో పోటీల్లో సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. షటిల్ పోటీల్లో జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో ద్వితీయస్థానం, బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సీనియర్స్ విభాగంలో ప్రథమస్థానం, జూనియర్స్ విభాగంలో ద్వితీయస్థానం, వాలీబాల్ పోటీల్లో సీనియర్స్ విభాగంలో ద్వితీయస్థానం కైవసం చేసుకుంది. సబ్‌జోన్ పోటీల్లో ఐదు క్రీడాంశాల్లో లింగారెడ్డిపాలెం విద్యార్థినులు ప్రథమం మరో ఐదు క్రీడాంశాల్లో ద్వితీయస్థానంలో నిలిచి నియోజకవర్గంలో సత్తాచాటారు. ప్రతిభ కనబర్చిన లింగారెడ్డిపాలెం జెడ్పీ పాఠశాల విద్యార్థినులతో పాటు వీరికి శిక్షణ ఇచ్చిన పీడీ బీపీఎల్ ప్రసాద్, హెచ్‌ఎం కే నాగరత్నకుమారిలను ఎంఈఓలు టి.వి.ఎం.రామదాసు, శ్రీనివాసరావులు అభినందించారు.

మందిర నిర్మాణానికి శంకుస్థాపన




గంగానమ్మ మందిర నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాగిరెడ్డి, గ్రామస్తులు

టి.కొత్తపాలెం(నాగాయలంక): స్థానిక గ్రామదేవత గంగానమ్మ మందిర నిర్మాణానికి ఆదివారం ఆదివారం ఉదయం 9.18 గంటలకు శంకుస్థాపన శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని టి.కొత్తపాలెం గ్రామస్తులు, భక్తబృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. గూడూరు రామకృష్ణశర్మ బృందం ఆధ్వర్యంలో శ్రీభ్రమరాంబ సమేత శ్రీమల్లేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త బండ్రెడ్డి నాగిరెడ్డి, నాగసుశీల దంపతులు పీటలపై కూర్చుని శంకుస్థాపన పూజ జరిపారు. ఈ సందర్భంగా బండ్రెడ్డి మాణిక్యాలరావు దంపతులచే శ్రీలక్ష్మీగణపతిహోమం, వాస్తు హోమం జరిపారు. గ్రామ సర్పంచి బండ్రెడ్డి శివపార్వతి, మాజీ సర్పంచి మెండు లక్ష్మణరావు (చంటి), రేమాల బసవారావు, లేబాక అంకాలు, ఆదినారాయణ, శేషగిరి తదితర ప్రముఖులు, భక్తబృందం సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో కౌలురైతుల ప్రస్తావన ఏదీ?

ఘంటసాల: కైలు రైతుల ప్రస్తావన కేంద్ర బడ్జెట్టులో లేకపోవడం బాధాకరమని ఏపీ కౌలురైతు సంఘం కృష్ణా జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణ రావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్టులో రైతాంగానికి ప్రాధన్యత ఇవ్వకపోవడమే కాక వ్యవసాయ రంగంలో కీలకంగా ఉన్న కౌలు రైతుల ప్రస్తావన లేదన్నారు. 2020- 21 నుంచి వ్యవసాయ రంగానికి కేంద్రంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వం కేటాయింపులు తగ్గిస్తూ వస్తోందన్నారు. దేశంలో ఉపాధి కల్పనలో వ్యవసాయ రంగం వాటా 44.1 శాతం నుంచి 46.1 శాతానికి పెరిగింది కానీ బడ్జెట్టులో ఈ రంగానికి ప్రాధాన్యత శూన్యంగా ఉందన్నారు. కనీస మద్దతు ధర, రైతులను రుణ విముక్తి చేసే విషయాల్లో బడ్జెట్లో ప్రస్తావించలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏపీ విభజన హామీలు, వైజాగ్ స్టీల్ ప్రైవేటీ కరణ నిలుపదలపై స్పష్టత ఇవ్వలేదు. ప్రత్యేక హోదా, కడప స్టీల్ ప్లాంట్ ప్రస్తావన లేదు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా రైతుల కోర్కెలు, గ్రామీణ ప్రాంత అవసరాలు దృష్టిలో పెట్టుకుని వ్యవసాయం, అనుబంధ రంగాలకు నిధులు అధికంగా కేటాయించాలని ఏపీ కౌలు రైతుల సంఘం కోరుతోందన్నారు. దీని కోసం ఈనెల 5న గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్టు ప్రతులను దహనం చేస్తూ నిరసనలు తెలియజేయాలని కౌలు రైతులను ఏపీ కౌలు రైతు సంఘం పిలుపునిచ్చిందని నారాయణరావు తెలిపారు.



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

మచిలీపట్నం డివిజన్

99122 20543 (మచిలీపట్నం, పెడన)

79955 66983 (అవనిగడ్డ)

Office mail : sakshiads@gmail.com